నెమ్మదించిన ధాన్యం కొనుగోళ్లు

- కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు
- అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు
- జాప్యం లేకుండా కొనుగోళ్లు చేయాలంటున్న రైతులు


దావాజిపల్లి కేంద్రంలో అకాల వర్షాలకు తడవకుండా కవర్లు కప్పిన రైతులు


బుసిరెడ్డిపల్లి కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

పాన్‌గల్: యాసంగి సీజన్‌లో మండల వ్యాప్తంగా పండించిన వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకపోతున్నాయి. కొనుగోలు మందకొడిగా సాగుతుండటంతో రోజుల తరబడి రైతులు కేంద్రాల్లో పడిగాపులు కాయాల్సి వస్తోంది. దీనికి తోడు అకాల వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం పాడవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండల పరిస్థితి..
మండలంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో 18 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాంటా చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చాలా కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయాయి. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని కాంటా చేయకుండా తేమ పేరుతో జాప్యం చేస్తున్నారు. తేమ శాతం 17 లోపు ఉన్నా తూకం చేసే సమయానికి అకాల వర్షాలు వస్తుండటంతో మళ్లీ తేమ శాతం పెరుగుతుందని రైతులు వాపోతున్నారు. మరోపక్క తూకం చేసిన ధాన్యం బస్తాలు తరలించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.5 కోట్లకు పైగా డబ్బులు పెండింగ్
మండలంలో 18 కేంద్రాల ద్వారా ఇప్పటికి వరకు 861 మంది రైతుల నుంచి 54,517.20 క్వింటాళ్ల ధాన్యం సేకరించగా వాటిలో ఇంకా 261 మంది రైతులకు రూ.5.35కోట్ల డబ్బులు జమకావాల్సి ఉంది. ఆయా రైతులకు సంబంధించిన డబ్బులు బిల్లులు చేశామని సర్వర్ సమస్యతో కొంత ఆలస్యం అవుతున్నాయని, త్వరలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు.

తూకాల్లో మోసాలు
గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో తూకాల్లో మోసాలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. తూకం చేసే సమయంలో బస్తా ఖాళీ సంచితో పాటు 41 కేజీల వరకు తూకం చేయాల్సి ఉండగా 42 కేజీల వరకు తూకం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా కేంద్రాలను తనిఖీ చేసి అలా జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు.

తేమ పేరుతో ఇబ్బందులు


ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో జాప్యం లేకుండా ధాన్యం తూకాలు చేస్తే అకాల వర్షాలు సంభవించిన సమయంలో ఇబ్బందులు తొలుగుతాయి. తేమ పేరుతో తూకాల్లో జాప్యం జరుగుతుంది. దీంతో అకాల వర్షాలు సంభవించిన సమయంలో ధాన్యంను కాపాడుకోవడంలో ఇబ్బందులు పడుతున్నాం.
– మన్నెం, రైతు, దావాజిపల్లి

తూకంలో మోసాలు


మా గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలో తూకంలో మోసాలు జరుగుతున్నాయి. 40 కేజీల ధాన్యం తూకం చేసే సమయంలో ఖాళీ సంచితో కలిపి 41 కేజీల వరకు ధాన్యం తూకం చేయాల్సి ఉండగా 42 కేజీల ధాన్యం తూకం చేస్తున్నారు. దీంతో రైతులు చాలా నష్టపోతున్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి రైతులకు నష్టం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలి.
– స్వామి, రైతు, బుసిరెడ్డిపల్లి

జాప్యం లేకుండా..


చాలా కేంద్రాల్లో ధాన్యం ఎలాంటి జాప్యం లేకుండా తూకం చేస్తున్నాం. తూకం చేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నాం. కొన్ని కేంద్రాల్లో తేమ శాతం విషయంలో సేకరణలో కొంత జాప్యం జరుగుతుంది. దానిని అధిగమించి జాప్యం లేకుండా చూస్తాం. సింగిల్ విండో ద్వారా ఇంకా 261 మంది రైతులకు సంబంధించిన డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి. అవి కూడా త్వరలో విడుదల అవుతాయన్నారు.
– భాస్కర్‌గౌడ్, సింగిల్ విండో సీఈఓ, పాన్‌గల్

రాజ్యాంగ పుస్తకాన్ని ఉచితంగా పంపిణీ చేయాలి

గోపాల్‌పేట: దేశాన్ని నడిపిస్తున్న రాజ్యాంగ పీఠికను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసి, పౌరుల హక్కులపై అవగాహన కల్పించాలని రేవల్లి మండల ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు రేవల్లి మండల కేంద్రంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీరాములుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాగరాజు, ఎల్లస్వామి, కురుమన్న, రామచందర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: రాజ్యాంగ గ్రంథాన్ని ఇంటింటికీ ఉచితంగా పంపిణీ చేయాలని ధర్మ సామాజ్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ధర్మ సమాజ పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఎల్లయ్య, అశోక్, రవి, నాగరాజు, వెంకటయ్య, భగవంతు, లక్ష్మణ్, ఎల్లయ్య, బలరాం, అంజనేయులు, రవి తదితరులు పాల్గొన్నారు.


రేవల్లిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న డీఎస్పీ నాయకులు

పెబ్బేర్‌రూరల్: శ్రీరంగాపురం మండలంలోని ప్రతి ఇంటికి భారత రాజ్యాంగ గ్రంథాన్ని పంపిణీ చేయాలని ధర్మసమాజ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రంగస్వామి, శివరాజ్, ఈశ్వరయ్య, బాలస్వామి, ఆంజనేయులు, ఎల్లయ్య, బాలరాం పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..

అమరచింత: పట్టణంలోని బీసీ కాలనీలోని ఆరో వార్డులో నూతనంగా సీసీ రహదారిని నిర్మించిన అధికారులు, ప్రజాప్రతినిధులు రహదారి పక్కన ఉన్న తాగునీటి పైపులైన్ గేట్‌వాల్‌ను విస్మరించారు. గుంతల మధ్య గేట్‌వాల్ ఉన్న ప్రదేశాన్ని వదిలి మిగిలిన ప్రదేశంలో రహదారిని నిర్మించారు. దీంతో పగటి పూటనే ద్విచక్ర వాహనదారులు ఆ గుంతను అంచనా వేయలేక కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. శాశ్వత రహదారి నిర్మించిన అధికారులు గేట్‌వాల్‌కు సైతం రింగులు వేసి మిగిలిన ప్రదేశంలో సీసీ రహదారి వేస్తే గుంతలు ఉండవని కాలనీ వాసులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మోటార్ రాజేశ్వర్‌రెడ్డి ఇంటి సమీపంలో ఉన్న గేట్‌వాల్‌కు రింగులు అమర్చి గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.


గేట్‌వాల్ ఉన్న గుంతను పూడ్చకుండా వదిలేసిన ప్రాంతం

వడ్ల కొనుగోలులో అవకతవకలు తగదు

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్, గోపులాపూర్‌లో వడ్ల కొనుగోలు కేంద్రాలలో మోసాలను అధికారులు అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ డిమాండ్ చేశారు. జటప్రోల్ వరి కొనుగోలు కేంద్రాన్ని వారు పరిశీలించారు. గతంలో ఎన్నోసార్లు తరుగు పేరుతో ఎన్నో మోసాలు చేసి రైతులను ఇబ్బంది పెట్టారని, ఇప్పుడైన అధికారులు కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు.

ధర్నా చేపడుతాం

కోడేరు: ధాన్యం కొనుగోలు చేయకపోతే ధర్నా చేపడుతామని మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని బావాయిపల్లిలో రైతులు పండించిన వరిధాన్యాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన వరి పంటను ప్రభుత్వం నెల రోజుల నుంచి కొనుగోలు చేయడం లేదన్నారు. రెండు రోజుల్లో ధాన్యం కొనుగోలు చేయకపోతే పెద్ద ఎత్తున రైతులతో కలిసి ధర్నా చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దశరథం, కుర్మయ్య, నర్సింహ రైతులు పాల్గొన్నారు.

వార్షికోత్సవ పూజలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని షిరిడీసాయిబాబ ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, సత్యనారాయణస్వామి వ్రతం, మంగళహారతి, మధ్యాహ్నం అన్నదానం చేశారు.

15 నుంచి మండల స్థాయి ఆటల పోటీలు


పాన్‌గల్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయి ఆట పోటీలను స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. 15 ఏళ్ల నుంచి 36 ఏళ్ల లోపు ఉన్న యువత పోటీలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ వివరాలను ఎంపీడీఓ కార్యాలయంలో 12,13 తేదీల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గెలిచిన వారిని జిల్లా స్థాయిలో.. అక్కడి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు.

పాన్‌గల్: మండలంలో ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించే సీఎం కప్ వేసవి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాముయాదవ్ సూచించారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను ఈనెల 14వ తేదీ వరకు ఎంపీడీఓ కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ చక్రపాణి, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ నాగన్న, బీఆర్ఎస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: మండల స్థాయి 'చీఫ్ మినిస్టర్ కప్' పోటీలను ఈనెల 15నుంచి 17వరకు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సంధ్య, ఎంపీడీఓ అఫ్జల్, ఎంఈవో జయశంకర్, ఎస్ఐ హరిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అథ్లెటిక్స్ 100మీటరు, 400మీటర్లు, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు 15 ఏళ్ల నుంచి 35ఏళ్లలోపు పురుషులు, మహిళలు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీల్లో పాల్గొనేవారు బి.శివకుమార్ ఫిజికల్ డైరెక్టర్, పెద్దమందడి ఫోన్ నంబర్ 98854 54253 కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.


మదనాపురంలో..


పెబ్బేరులో..

మదనాపురం: ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కప్ సంబురాలను మండలంలో ఘనంగా నిర్వహించాలని తహసీల్దార్ నరేందర్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సూచనలు చేశారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఎంపీడీఓ కార్యాలయంలో తమపేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణయ్య, ఎంఈఓ కృష్ణయ్య, ఎస్ఐ మురళి పాల్గొన్నారు.

పెబ్బేరు: సీఎం క్రీడాకప్ మండల స్థాయి పోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ ఆవుల శైలజ గురువారం కోరారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల క్రీడా కమిటీ అధికారుల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం క్రీడా కప్ సంబరాలను పీపీఎల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ జయసింహ, ఎస్ఐ జగదీశ్వర్, మున్సిపల్ మేనేజర్ గణేష్‌బాబు, పంచాయతీ రాజ్ ఏఈ రమేష్ నాయుడు, ప్రధానోపాధ్యాయులు ఎండీ మైనోద్దీన్, పీఈటీ కురుమయ్య, సూపరింటెండెంట్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేర్‌రూరల్: శ్రీరంగపురం మండలంలో ఈనెల 15వ తేదీ నుంచి నిర్వహించే సీఎం క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ ప్రసన్న కుమారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. దీంతో పాటు స్విమింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, బాక్సింగ్, లాంగ్‌జంప్, షాట్‌పుట్ వంటి క్రీడల్లో నైపుణ్యం ఉన్న క్రీడాకారులు ఉంటే వారు నేరుగా జిల్లా స్థాయిలో పాల్గొనేందుకు అవకాశం కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు పీఈటీ నిరంజన్‌గౌడ్ 90002 69629 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

గరుడ స్తంభం, బొడ్రాళ్ల ప్రతిష్ఠాపనకు విరాళం



పెబ్బేరు: మండలంలోని బూడిదపాడులో గరుడ స్తంభం, బొడ్రాళ్ల పండుగ సందర్భంగా గురువారం పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి రూ. 50 వేలు విరాళం అందించారు. గ్రామంలో బొడ్రాళ్ల పండుగకు ముందుకొచ్చి విరాళం ఇచ్చినందుకు గ్రామ ప్రజలు ఎంపీపీ మేఘారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హరిశంకర్‌రెడ్డి, అనుజ్ఞారెడ్డి, సురేందర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, నరసింహరెడ్డి, ఓంప్రకాష్, శంకర్‌నాయుడు, మోహన్‌నాయుడు ఉన్నారు.

శివాలయం నిర్మాణానికి..



పెబ్బేర్ రూరల్: శ్రీరంగపురం మండలంలోని కంభాళాపురంలో నిర్మించే శివాలయ నిర్మాణానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎద్దుల రాజవర్ధన్ రెడ్డి తన వంతు సాయంగా రూ.10వేలు కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు స్వామి, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ పనుల పరిశీలన



వీపనగండ్ల: స్వచ్ఛ సర్వేక్షన్ పనుల్లో భాగంగా మండల కేంద్రంలో చేసిన పలు అభివృద్ధి పనులను గురువారం ఫీల్డ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. గ్రామంలో నిర్మించిన మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, తడి, పొడిచెత్తను వేరు చేయు విధానం తదితర పనుల గురించి ఆరా తీశారు. గ్రామంలోని మురుగు కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో చిన్నంబావి ఎంపీడీఓ రామస్వామి, ఫీల్డ్ అధికారులు మద్దిలేటి, ఖలీల్, అంగన్‌వాడీ టీచర్ సుగుణాభాయి, ఆశావర్కర్ రాధ, వాటర్‌మ్యాన్ శివరాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



కొత్తకోట రూరల్: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని పెద్దమందడి ఎస్ఐ హరిప్రసాద్ హెచ్చరించారు. గురువారం మండలంలోని బలిజపల్లి–వనపర్తి రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించిన పత్రాలను తనిఖీ చేయడంతో పాటు మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానాలు విధించినట్లు ఎస్ఐ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జరిగే నష్టాల గురించి వాహనదారులకు వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ పెట్టుకోవడంతో పాటు వాహనాలకు సంబంధించిన పత్రాలను కలిగి ఉండాలన్నారు.

వాహనాల తనిఖీ
పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో గురువారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ట్రాక్టర్‌లు నడిపే ప్రతి ఒక్కరూ ముందు, వెనకాల ఖచ్చితంగా రేడియం ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఖాజా, సిబ్బంది, వాహనాల యజమానులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

కొల్లాపూర్: వ్యవసాయ సాగుకోసం రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. గత ఎన్నికల సమయంలో ప్రకటించిన మేరకు రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీని వెంటనే చేపట్టాలన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో భాస్కర్‌నాయక్, తారాసింగ్, సురేందర్, రామకృష్ణ, కిరణ్‌కుమార్, అనిల్ ఉన్నారు.



నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు


నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలో పాల్గొన్న దాత రామస్వామి దంపతులు

పాన్‌గల్: మండలంలోని కొత్తపేట ఆంజనేయ స్వామి ఆలయంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక పూజలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు విగ్రహాల దాత గ్రామ బీఆర్ఎస్ నాయకుడు దిండి రామస్వామి, సుధారాణి దంపతుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, అంకురార్పణం, నవగ్రహ జపాలు, మూలా దేవతార్చన, ధాన్యధివాసం, శివ పార్వతుల కల్యాణం, తీర్థ ప్రసాదాల గోష్ఠి వంటి ప్రత్యేక పూజలను పూజారులు మధుసూదన్, మోహనయ్య, శేఖరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యేక పూజలకు హాజరైన భక్తులకు గ్రామానికి చెందిన భీంరెడ్డి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాముయాదవ్, ఎంపీటీసీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కృష్ణయ్య, రాములు, శివారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నాగరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


విన్నర్‌కు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట: క్రీడల్లో గెలుపోటములు సహజమని దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యుడు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. కొత్తకోట ఆరోగ్య వాకింగ్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో 15 రోజులుగా కొనసాగుతున్న క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీలో విన్నర్‌గా నిలిచిన మక్తల్ టీంకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సొంతంగా రూ.లక్షతో పాటు మెమెంటో అందజేశారు. అదేవిధంగా రన్నర్‌గా నిలిచిన కొత్తకోట టీంకు కొత్తకోట సింగిల్ విండో చైర్మన్ కొట్టం వంశీధర్‌రెడ్డి సొంతంగా రూ. 50 వేలు, మెమెంటో బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్య వాకింగ్ టీం సభ్యులు ఎంతో శ్రమించి క్రికెట్ పోటీలను దిగ్విజయంగా పూర్తి చేసినందుకు వారిని ఆయన అభినందించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల 70 టీంలు పాల్గొన్నప్పటికి, వారందరికీ ఇబ్బందులకు కలగకుండా పోటీలను పూర్తి చేసినట్లు చెప్పారు. యువత ప్రతి ఒక్కరూ ఇలాంటి వాకింగ్ టీం సభ్యులను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన సూచించారు. క్రీడల వల్ల యువతకు ఆరోగ్యంతో పాటు, సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు విశ్వేశ్వర్, ఆరోగ్య క్రికెట్ క్లబ్ వ్యవస్థాపకుడు శేఖర్‌గౌడ్, కొత్తకోట సింగిల్ విండో చైర్మన్ వంశీధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సుఖేశిని, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, నాయకులు సంధ్య రవీందర్‌రెడ్డి, ప్రశాంత్, జగన్, అంజనేయులు, రాములు యాదవ్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల తరలింపులో నిర్లక్ష్యం


అమరచింతలో వీధి కుక్కల సంచారం

అమరచింత: మున్సిపాలిటీ కేంద్రంలో వీధి కుక్కల దాడుల్లో ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నా కుక్కల తరలింపునకు మున్సిపాలిటీ అధికారులు శ్రీకారం చుట్టినట్టే చేసి ప్రస్తుతం వెనక్కి తగ్గారు. దీంతో మరోమారు పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలను పట్టుకొని తరలించడానికి నెల్లూరుకు చెందిన రెండు ప్రత్యేక బృందాలను మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా రప్పించారు. రెండు రోజుల పాటు 190 కుక్కలను పట్టుకున్నామని మున్సిపల్ అధికారులు వెల్లడించారు. పట్టణంలో పూర్తి స్థాయిలో కుక్కలను తరలిస్తామని ప్రకటించిన అధికారులు.. ప్రస్తుతం కుక్కల తరలింపును నిలిపి వేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల తరలింపు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలని ధర్నా


ధర్నా చేస్తున్న జమ్ములతండా వాసులు

వనపర్తి: తమ తండాకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గురువారం మండలంలోని సవాయిగూడెం పంచాయతీ పరిధిలోని జమ్ములతండా వాసులు నాచహళ్లి శివారులో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఇటీవల రోడ్డు వేసేందుకు పంచాయతీరాజ్ నిధులు మంజూరైనా.. కొందరు నాయకులు ఉద్దేశపూర్వకంగా రోడ్డు వేయకుండా అడ్డుకుంటున్నారని, వెంటనే అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్‌చేశారు. సుమారు గంట పాటు రోడ్డుపై తండావాసులు బైఠాయించటంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు జోక్యం చేసుకుని వారిని శాంతిపజేశారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్: ఎమ్మెల్యే


వైష్ణవిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆల

అడ్డాకుల: విద్యార్థులు చదువుల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మూసాపేటకు చెందిన విద్యార్థిని బీసం వైష్ణవి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి పదోతరగతిలో 10 జీపీఏ సాధించగా.. గురువారం రాత్రి విద్యార్థినితో పాటు తల్లిదండ్రులు బీసం శ్యామ్, గౌరమ్మను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైష్ణవి చదువుకు ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా వైష్ణవిని పాఠశాలలో ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్, ఎంపీపీ కళావతి, రైతుబంధు సమితి అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, కో–ఆప్షన్ సభ్యుడు మదీనా జమీర్, సర్పంచ్ స్వరూప, హెచ్ఎం భాస్కర్, నాయకులు లక్ష్మీనర్సింహ, కొండయ్య, మశ్చందర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఎమ్మెల్యేల పేర్లు బయటపెట్టాలి

ఎర్రవల్లిచౌరస్తా: దళితబంధు పథకంలో కమీషన్ల పేరుతో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల పేర్లను తక్షణమే ప్రభుత్వం బయటపెట్టాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఎంబీ కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దళితబంధు పథకంలో కమీషన్లు తీసుకున్న ఎమ్మెల్యే చిట్టా తన దగ్గర ఉందని స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆరే ప్రకటించారని వెంటనే వారి పేర్లు వెల్లడించాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లిం, మైనారిటీల రిజర్వేషన్లను తొలగిస్తామన్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు ఎందుకు ఖండించలేదో చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో వచ్చి కులాలు, మతాలు, రిజర్వేషన్లపై చిచ్చురేపుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కేంద్రం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ పేదలను నిలువునా ముంచుతుందని మండిపడ్డారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీఎస్పీపై అసత్య ఆరోపణలు మానుకోకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో తిరుపాల్, ఉపేందర్, రాముడు, లక్ష్మన్న, బీసన్న, సురేష్‌కుమార్ ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

ఎర్రవల్లిచౌరస్తా: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం గురువారం ఇటిక్యాల మండలంలోని ఆర్. గార్లపాడుకు చెందిన హుసేన్ (కిట్టు) పని నిమిత్తం బైక్‌పై ఎర్రవల్లికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. అదేవిధంగా పెబ్బేర్ మండలంలోని పెంచికలపాడుకు చెందిన ఉసేన్, బీచుపల్లిలు బైక్‌పై బి. వీరాపురం నుంచి స్వగ్రామానికి వెళ్తూ దువాసిపల్లి సమీపంలోకి రాగానే రెండు ద్విచక్ర వాహనాలు ప్రమాదవశాత్తు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఉసేన్, బీచుపల్లిలు స్వల్ప గాయాలతో బయట పడగా, హుసేన్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు.